క్లుప్తంగా

రఘునాథపాలెం సీఐగా ఉస్మాన్‌షరీఫ్ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ

రఘునాథపాలెం: రఘునాథపాలెం సీఐ(ఎస్‌హెచ్ఓ)గా ఎండి.ఉస్మాన్‌షరీఫ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ బ్రాంచిలో పని చేస్తున్న ఉస్మాన్‌షరీఫ్ రఘునాథపాలెంకు వచ్చారు. ఈ మేరకు సీఐని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'ఫ్రూట్ మర్చంట్' కార్యవర్గం ఎన్నిక



అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఖమ్మం మామిళ్లగూడెం: ఫ్రూట్ మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఖమ్మం నూతన కార్యవర్గాన్ని సోమవారం సంఘ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గరగ శ్రీనివాస్, అధ్యక్షుడిగా షేక్ జానీమియా, ప్రధాన కార్యదర్శిగా ఏటుకూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కె.అబ్దుల్ నబీ, సహాయ కార్యదర్శిగా ఎస్.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఎండి.ఉస్మాన్‌అలీ, గౌరవ సలహాదారులుగా ఏ.మల్లికార్జున్‌లను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ఎస్‌కె.కరీం, ఎస్‌కె.ఖాసీంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎస్టీఓ కృష్ణారావు బదిలీ

నేలకొండపల్లి: బదిలీల్లో భాగంగా స్థానిక సబ్ ట్రెజరీ అధికారి(ఎస్‌టీఓ) ఎస్.వి.కృష్ణారావు ఇల్లెందు వెళ్లారు. పదేళ్లకు పైగా ఇక్కడ విధులు నిర్వర్తించారు. మహబూబాబాద్‌లో ఎస్‌టీవో గా పని చేస్తున్న హఫీజ్‌ను నేలకొండపల్లి ఎస్‌టీఓగా రానున్నారు. అదే విధంగా నేలకొండపల్లి సీనియర్ అకౌంటెంట్‌గా వై.శ్రీనివాస రెడ్డి విధులలో చేరారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

నేలకొండపల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎక్సైజ్ కార్యాలయం నిర్మించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ప్రతినిధులు ఎక్సైజ్ కార్యాలయం భవనాన్ని పరిశీలించారు. పట్టణ కార్యదర్శి మందడపు మురళీకృష్ణ, నర్సయ్య, కె.వీ.చారి పాల్గొన్నారు.

అక్రమ రవాణా నిర్మూలనకు సహకరించాలి

నేలకొండపల్లి: మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏఎస్సై కె.కోడేత్రాచు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కోప్ ఆర్ది మై ఛాయిస్ ఫౌండేషన్, పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నరసింహారావు, కో–ఆర్డినేటర్ సుజాత, ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎన్.శాస్త్రి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

కామేపల్లి: మండలంలోని బర్లగూడెం గ్రామంలో పీహెచ్‌సీ సోమవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి నెల్లూరి చందన పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు.

కృష్ణసాయి ఆశ్రమంలో సత్య వ్రతాలు



వ్రత పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని హర్కారాబావి రోడ్ రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ కృష్ణ సాయి ఆశ్రమంలో సోమవారం శ్రీషిర్డీ సాయి సత్యవ్రతాలను నిర్వహించారు. ఆశ్రమ చైర్మన్ లగడపాటి రామారావు, కార్యదర్శి సిద్దంశెట్టి నాగమణి, మధుసూదన్‌రావు, శ్రీనివాసరావు, నరహరి రమేష్, వెంకటరామారావు, సంజయ్, నరసింహారావు, సుదర్శనగుప్తా, రమణ, సిద్దంశెట్టి శ్రీకాంత్, స్వరాజ్య లక్ష్మీ, కృష్ణారావు, కృష్ణకుమారి, మురళీకృష్ణ ఉన్నారు.

సన్మానం

కామేపల్లి: మండలంలోని గోవింద్రాల కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలల్లో బదిలీ, పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులకు సోమవారం గోవింద్రాల హైస్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యాన సన్మానం నిర్వహించారు. శ్రీనివాసరావు, కుమారస్వామి ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఖమ్మంరూరల్: ఎరువులు, పరుగుమందులు సబ్సిడీతో అందించి రైతుల్ని ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు ఏఐకేఎంఎస్ నాయకులు సోమవారం కోరారు. స్వామినాథన్ కమీషన్ సిఫారసు మేరకు పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు.

నీటి నిల్వ కష్టమే..!

శిథిలావస్థలో చెరువుమాధారం చెరువు షటర్లు, తూములు

- వృథాగా పోతున్న నీరు
- రెగ్యులేటర్ షటర్లను పట్టించుకోని వైనం
- లీకేజీలపై స్పందించని అధికారులు



తుప్పపట్టిన రెగ్యులేటర్ షటర్లు



తూము నుంచి వృథాగా పోతున్న నీరు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువు రెగ్యులేటర్ షటర్లు, తూములు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరాయి. ఎండాకాలం ఎన్నికల విధులలో బీజీగా ఉన్న అధికార యంత్రాంగం మరమ్మతుల గురించి పట్టించుకోలేదు. ఇప్పుడు వర్షాలు వస్తున్నాయి పడే ప్రతీ చినుకు నిల్వ ఉండటం కష్టంగానే మారింది. చెరువులోకి నీరు వచ్చిన నిలువటం కష్టమే వచ్చిన నీరంతా ఏపీకి చేరుతుంది. అధికారుల తీరుపై రైతులు భగ్గుమంటున్నారు.

ప్రశ్నార్థకంగా ఆయకట్టు..

చెరువుమాధారం చెరువు నుంచి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెరువు నుంచి దేవినేని వెంకటరమణ కెనాల్‌కు నీటిని పంపించేందుకు ఏర్పాటు చేసిన రెగ్యులేటర్ షట్టర్లు తుప్పు పట్టి ఉన్న కొద్దిపాటి నీరు మొత్తం వృథాగా కిందకు పోతుంది. గతంలో చెరువు నిండా నీరు ఉన్నప్పటికీ సగం చెరువు ఖాళీ కావటానికి ఇదే ప్రథమ కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా రెగ్యులేటర్‌తో పాటు చెరువుకు ఉన్న మరో మూడు తూములు కూడా తుప్పు పట్టి అవసరం లేకున్నా నీరంతా కిందకుపోతుంది. దీంతో రైతులకు తీరని నష్టం కలుగుతుంది. మరమ్మతులు కాకపోవటంతో చెరువులోకి నీరు వచ్చిన ఉపయోగం లేకుండా అంతా లీకైపోతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న రెగ్యులేటర్ షట్టర్లు, తూములకు మరమ్మతులు చేయకపోతే ఈ ఏడాది చెరువు కింద ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇప్పుడు మరమ్మతులు చేయటానికి వర్షం పడుతుండటంతో సాధ్యం కాదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

40 ఏళ్లలో ఎండని చెరువు..

గత 40 ఏళ్లలో ఎప్పుడూ చెరువు ఎండిన దాఖలాలు లేవని, ఈ ఏడాది మాత్రం ఎడారిని తలపించే విధంగా చెరువుమారిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ముందు చూపుతో మరమ్మతులు చేయించి ఉంటే చెరువు నీరు వృథాను అడ్డుకోవచ్చున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారులు పట్టించుకోలేదు..



చెరువు విషయంపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. చెరువు నీరంతా రెగ్యులేటర్, తూముల వద్ద నుంచి వృథాగా పోతుంది. చెరువును ఈ దుస్థితిలో ఎప్పుడు చూడలేదు. వర్షాలకు చెరువు నిండుతుందని సంతోషపడ్డాం. కానీ అధికారుల నిర్వాకం వలన ఆశలు వదులుకున్నాం. కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేస్తాం.

– ధీరావత్ రాధాకృష్ణమూర్తి, చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు

రోడ్డు పంచాయితీపై విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్

నేలకొండపల్లి: మండలంలోని తిరుమలాపురంలో గిరిజన రైతులకు సంబంధించిన రహదారి పంచాయితీపై సోమవారం ఆర్‌డీఓ గణేష్ విచారణ చేపట్టారు. తిరుమలాపురంలో 50 ఎకరాల సాగు భూమికి రోడ్డు లేకుండా కంచె ఏర్పాటు చేయటంతో రెండేళ్ల నుంచి సాగు చేయకుండా వదిలేశారు. ఇటీవల మంత్రి పొంగులేటికి గిరిజనులు వారి గోడును వినిపించగా స్పందించిన మంత్రి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు భూములకు చెందిన నక్షాను పరిశీలించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో తిరుమలాపురంలోని భూముల వద్దకు వెళ్లి బాధిత గిరిజన రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో టిఫిన్ సర్వే, నక్షాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.తహసీల్దార్ గౌరి శంకర్, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్రాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆలస్యం మధుసూదన్‌రావు, మాధవి, సర్వేయర్ వెంకయ్య పాల్గొన్నారు.

సెల్‌టవర్ తొలగించాలి

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల గ్రామ సెంటర్‌లో ఉన్న సెల్ టవర్‌ను తొలగించాలంటూ సోమవారం స్థానికులు రహదారిపై ఆందోళన చేశారు. సెల్ టవర్ కారణంగా తామంతా అనారోగ్యం బారిన పడుతున్నామని, చిన్నారులకు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు

కామేపల్లి: కామేపల్లి ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సాయికుమార్‌ను కామేపల్లి బీఆర్ఎస్ నాయకులు సోమవారం కలిసి ఘనంగా సన్మానించారు. నాయకులు ఆంతోటి అచ్చయ్య, కాట్రాల రాంబాబు, సామా మోహన్‌రెడ్డి, మల్లెంపాటి శ్రీనివాసరావు, తీర్థాల చిదంబరరావు, మూడ్ కృష్ణ ప్రసాద్ నాయక్, వడియాల కృష్ణారెడ్డి, కొనకంచి శంకర్, జాటోత్ జాయ్‌లూసీ, చిప్పలపల్లి శ్రీనివాస రావు, ఆదూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాల్లో సవరణ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్: కొత్త న్యాయ చట్టాల సవరణతో పాటు సెంట్రల్ నోటరీ పబ్లిక్ అపాయింట్‌మెంట్, న్యాయవాదుల రక్షణ బిల్లు తదితర అంశాలపై రాజ్యసభలో మాట్లాడాలని కోరుతూ ఖమ్మం బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కోరారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని సోమవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్పందించిన ఎంపీ కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌కు లేఖ రాయడంతో పాటు సభలో ప్రస్తావిస్తానని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, న్యాయవాదులు తాళ్లూరి దిలీప్‌చౌదరి, సంక్రాంతి రాజశేఖర్ ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి




ఆందోళనలో మాట్లాడుతున్న కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలో భూకబ్జాలు, అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులు, బాధితులతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించగా ఆయన మాట్లాడారు. మహిళల స్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన కొందరు ఇదేమిటని అడిగితే దాడులకు పాల్పడుతున్నారన్నారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్పొరేటర్ మలీదు జగన్‌యాదవ్, సింహాద్రియాదవ్, నాగేశ్వరరావు, నరసయ్య, భద్రూ నాయక్, రవిచంద్ర చౌహాన్, శ్రీనివాస్‌నాయక్, రవీందర్‌నాయక్, నాగేశ్వరరావు, నాగరాజు, స్వరూపరెడ్డి, ధనలక్ష్మి, లక్ష్మి, ఉపేంద్ర బాయి, జ్యోతి, స్పందన, ఉన్నారు.

ఆశావర్కర్ల ధర్నా

ఖమ్మంమయూరిసెంటర్: ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో ఆశాలు సమ్మె చేయగా వారి సమస్యల పరిష్కారానికి ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామని, వేసిన కమిటీ ఆశాల సమస్యలను పరిశీలించి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఇప్పుడు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.మంగమ్మ, బి.అమల, నాయకులు రమణ, నాగమణి, ప్రమీల, రాధా, కల్యాణి, జ్యోతి పాల్గొన్నారు.

తెలంగాణ చైతన్య స్ఫూర్తి దాశరథి



ఖమ్మంరూరల్: దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు దాశరథి కృష్ణమాచార్యులు రగిల్చిన చైతన్య స్ఫూర్తి కావాల్సిన సంకల్ప బలాన్ని ఇచ్చిందని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాశరథి కృష్ణమాచార్యులు జయంతి సందర్భంగా నామ ఆయనను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఆయన రచనలు తెలంగాణ సాంస్కృతిక, సాహితీ రంగాల్లో విశేషమైన ప్రభావాన్ని చూపించాయన్నారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆయనదో విశిష్ట శైలి అని పేర్కొన్నారు.

ఖమ్మంరూరల్: దాశరథి కృష్ణమాచార్యులు జయంతి సందర్భంగా మండలంలోని మంగళగూడెం ఉన్నత పాఠశాలలో దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం బి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు వి.యాదగిరి, శ్రీదేవి, ఐలయ్య, శ్రీనివాసరావు, డీవిఎస్.రెడ్డి, జయరాజ్, కుర్దూస్, కిస్తూ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వృత్తికే వ్యక్తిత్వానికి కాదు..



హోంగార్డును సన్మానిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఉద్యోగ విరమణ వృత్తికే, కాని వ్యక్తిత్వానికి కాదని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ఈ మేరకు ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు సిహెచ్. నాగేశ్వరరావును పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం సీపీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కామరాజు, హోంగార్డ్ ఆర్ఐ సురేష్, హోంగార్డ్ ఆఫీసర్స్ సంక్షేమ సంఘం బంక శ్రీను, నీరజా, నాగరాజు, రవి హోంగార్డ్ ఆఫీసర్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాత బస్టాండ్‌లో డైనింగ్ హాల్ ప్రారంభం

ఖమ్మంమయూరిసెంటర్: విధి నిర్వహణలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు భోజనం చేసేందుకు వీలుగా ఖమ్మం పాత బస్టాండ్‌లో ఆధునీకరించిన డైనింగ్ హాల్‌ను సోమవారం ఆర్‌ఎం సరిరామ్, మహిళా కండక్టర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. సిబ్బంది భోజనం చేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. డిపో మేనేజర్ దినేష్‌కుమార్, సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లుపాల్గొన్నారు.

బదిలీలు చేపట్టాలి

ఖమ్మం సహకారనగర్: కేజీబీవీలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్ల (సీఆర్టీల) బదిలీలను చేపట్టి, మినిమం బేసిక్ పే ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జివి నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 13 ఏళ్ల నుంచి నుండి ఒకే పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు ఉన్నారని ఇది విద్యారంగానికి క్షేమకరం కాదన్నారు. ఎక్కువ సంఖ్యలో ఖాళీలు ఏర్పడినందున ప్రస్తుతం బదిలీ చేస్తే బోధనా సామర్థ్యం పెరుగుతుందని, తక్షణమే బదిలీలకు షెడ్యూల్ ప్రకటించాలని కోరారు

గాయకుడికి అవార్డు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరానికి చెందిన సీనియర్ గాయకుడు, స్వర సుధ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వీవీ రెడ్డికి ఆదివారం కరీంనగర్ ఫిల్మ్ భవన్‌లో ఆర్యాణి సకల కళావేదిక ఆధ్వర్యంలో శ్రీ గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ స్ఫూర్తి ప్రదాత అవార్డును ప్రదానం చేశారు. స్వర్ణ కంకారణతో వీవీ రెడ్డిని సత్కరించారు. ఈ మేరకు వీవీ.రెడ్డిని ఖమ్మం గాయనీ గాయకులు, కళాకారులు అభినందించారు.

సీఐటీయూలో చేరిన హమాలీలు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని బైపాస్ రోడ్డు పెద్ద కూరగాయల మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలు సీఐటీయులో చేరారని, వారికి కండువా కప్పి సంఘంలోకి ఆహ్వానించినట్లు సంఘ రాష్ట్ర నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్‌లు తెలిపారు. సోమవారం స్థానిక మంచికంటి హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సంఘ జిల్లా అధ్యక్షుడు విష్ణు, నాయకులు వై విక్రమ్, శ్రీనివాసరావు, బండారు యాకయ్య, తిరుపతిరావు, బీరప్ప పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి: పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని, అధికారులు ప్రతీ రోజు పనులను పర్యవేక్షించాలని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. మండల పరిధిలో పలు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహాలు ఉన్న చోట డ్రెయినేజీ పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం ఈ నెల 26, 27 తేదీల్లో జరిగే ఎక్స్‌పో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ మేరకు పలువురు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, ఆర్‌డీఓ గణేష్, డీఎంహెచ్ఓ మాలతీ, నాయకులు శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, సీతారాములు, వెంకన్న, హనుమంతరావు, గరిడేపల్లి రామారావు, గోళ్ల శ్రీనివాసరావు, వంగవీటి నాగేశ్వరరావు, కట్టికోల సుధాకర్, కడియాల నరేష్, వేగినాటి లక్ష్మినర్సయ్య పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- కేఎంసీ గ్రీవెన్స్‌లో కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఫిర్యాదును పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం కేఎంసీలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, బర్త్ అండ్ డెత్, పారిశుధ్య విభాగాలకు సంబంధించిన సమస్యలపై 34 మంది ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదుదారులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించిన కమిషనర్ అధికారులతో చర్చించి ఆ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలన్నింటిని పరిష్కరించాలని, ఇంటి నిర్మాణ అనుమతులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే అనుమతులు జారీ చేయాలన్నారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి పెండింగ్ ఫైళ్లను కమిషనర్ గ్రీవెన్స్‌లోనే పరిశీలించి, ఇంటి నెంబర్ల అనుమతులకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సంపత్‌కుమార్, ఈఈ కృష్ణాలాల్, ఏసీపీ వసుంధర, ఏవో శివలింగం, ఆర్‌వో జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం..

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి: ఎన్నికలకు ముందు రైతులకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో తహసీల్దార్ సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా అమలు చేస్తామని, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ సునీత, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, లకావత్ సునీత, గుగులోత్ గబ్రూనాయక్, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, ఎంపీడీఓ రవీందర్, ఎస్సై సాయికుమార్, మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, దమ్మలపాటి సత్యనారాయణ, ఆరెం రవి, ఏపూరి మహేందర్, శ్రీనివాసరావు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో కుక్కల బెడద నుంచి ప్రజలను విముక్తి చేయాలని, డివిజన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన పార్టీ ఖమ్మం డివిజన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వర్షాల ఫలితంగా నగరంలో ప్రతీ రహదారిపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయని, యుద్ధప్రాతిపదికన వెంటనే నిధులు కేటాయించి గుంతలను పూడ్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు తిరుపతిరావు, ఎస్.నవీన్ రెడ్డి, నాయకులు బండారు యాకయ్య, మీరాసాహెబ్, శ్రీనివాసరావు, ఉపేంద్ర పాల్గొన్నారు.

రాయల ఆశయాల సాధనకు ఉద్యమించాలి

నేలకొండపల్లి: రాయల చంద్రశేఖర్ ఆశయాల సాధనకు ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య సూచించారు. మండల కేంద్రంలో రాయల చంద్రశేఖర్ సంతాప సభ నిర్వహించారు. నాయకులు పగిడికత్తుల రామదాసు, పగిడికత్తుల వెంకటేశ్వర్లు, పి.నాగేశ్వరరావు, భారతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంఅర్బన్: రాయల చంద్రశేఖర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కొనసాగించాలని భారత కార్మిక సంఘాల సమైక్య ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య అన్నారు. ఖమ్మం పారిశ్రామిక వాడల్లో ఐఎఫ్‌టీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభలో పాల్గొని మాట్లాడారు. నగర అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మినారాయణ, శ్రీనివాస్, నాయకులు నాగయ్య, బొమ్మగంటి రమేష్, శ్రీను, ఉప్పలయ్య, సురేష్, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం పెంచేలా బోధన

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విజ్ఞానం పెంచేలా బోధనలు నిర్వహిస్తున్నట్లు మండ్రాజుపల్లి హెచ్‌ఎం టి.గురవయ్య అన్నారు. మండలంలోని మండ్రాజుపల్లి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం ప్రారంభించారు.

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేటలో గల కేజీబీవీలో శిక్షాసప్తాహ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.

నిధులు కేటాయించాలి

ఖమ్మంఅర్బన్: జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతూ టీడీపీ ఖమ్మం పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు కొండబాల కరుణాకర్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, పాలడుగు కృష్ణ ప్రసాద్, సొసైటీ మాజీ అధ్యక్షుడు గుడిపూడి వెంకటేశ్వరావు, రామారావు, అశ్వని కుమార్ పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు బీహార్‌వాసి



సంజయ్‌ను తన తమ్ముడికి అప్పగిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం లేక కొన్ని నెలలు క్రితం ఖమ్మం వన్‌టౌన్ ఏరియాలో రోడ్లపై తిరుగుతున్న బీహార్ వాసిని అన్నం ఫౌండేషన్ ఆశ్రయంలో చేర్చగా సదరు వ్యక్తిని తన కుటుంబసభ్యుల చెంతకు సోమవారం చేర్చినట్లు చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. మే నెలలో మతిస్థిమితం లేని వ్యక్తి తిరుగుతూ ప్రజల్ని భయభ్రాంతులను చేస్తుండగా పోలీసులు అన్నం ఆశ్రయంలో అప్పగించారు. ఇటీవల కోలుకున్న వ్యక్తి తన పేరు సంజయ్ అని వివరాలు తెలపడంతో అక్కడ పోలీసులతో వారు కుటుంబ సభ్యులకి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు అతని తమ్ముడికి సంజయ్ అప్పగించినట్లు తెలిపారు. దారి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు వితరణ చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: వైరాలోని మధు విద్యాలయం, ఠాగూర్ విద్యాలయాల్లో చదివిన 1998వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు 25 వసంతాలైన సందర్భంగా సోమవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాలులో సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం మధు ప్రిన్సిపాల్ మల్లెంపాటి వీరభద్రం, ఠాగూర్ ప్రిన్సిపాల్ సంక్రాంతి రవికుమార్‌లను ఘనంగా సన్మానించారు.